

ఇప్పాయిపల్లి గ్రామంలో సాగు చేసిన పూల తోట

## పూల తోటలతో.. ఆదాయం బాగు


- తక్కువ ఖర్చు.. దిగుబడి ఎక్కువ
- సీజన్లలో పూలకు మంచి డిమాండ్
- పూల సాగులో రాణిస్తున్న ఇప్పాయిపల్లి గ్రామస్తులు

కులకచర్ల, డిసెంబర్ 10 : ఉన్న కొద్దిపాటి పొలంలో తక్కువ నీటితో ఎక్కువ లాభాలను ఆర్జించేందుకు రైతులు పూల తోటల సాగువైపు దృష్టి సారించారు. సీజన్లలో చామంతి, బంతి, మల్లె తదితర పూలకు మంచి డిమాండ్ ఉండడంతో దానిపై ఎక్కువగా ఆసక్తి చూపుతున్నారు. మండలంలోని ఇప్పాయిపల్లి గ్రామానికి చెందిన వెంకటయ్యగౌడ్ ఎకరం పొలంలో చామంతి పూల తోటను సాగు చేస్తూ లాభాలను ఆర్జిస్తున్నాడు. ప్రభుత్వం కూడా సంప్రదాయ పంటలను వదిలి ఆరుతడి పంటల సాగుకు మొగ్గు చూపాలని ప్రోత్సహిస్తున్న నేపథ్యంలో గ్రామంలోని చాలామంది రైతులు వివిధ రకాల పూల తోటల సాగుపై మొగ్గు చూపుతున్నారు. శివస్వాములు, హనుమాన్, అయ్యప్ప స్వాముల పూజలకు, పెండ్లిండ్ల సీజన్లలో పూలకు మంచి డిమాండ్ ఉన్నది. వేసవిలోనూ పూల సాగు లాభదాయకమమని పలువురు రైతులు పేర్కొంటున్నారు. పెట్టుబడులు పెట్టి నష్టపోయే బదులు తక్కువ ఖర్చు, తక్కువ శ్రమతో పూల తోటల సాగులో మంచి లాభాలు వస్తున్నాయన్నారు. తాము పండించిన పూలను మహబూబ్‌నగర్, హైదరాబాద్‌లోని మార్కెట్ల తరలిస్తున్నట్లు .. కిలో పూలు రూ. 300 నుంచి రూ.400 వరకు ధర పలుకుతున్నదని చెబుతున్నారు. అంతేకాకుండా పెండ్లిండ్లు, పేరంటాలకు చుట్టు పక్కల ఉండే గ్రామాల ప్రజలు మా గ్రామానికి వచ్చి పూలను కొంటున్నట్లు పేర్కొన్నారు.

### మంచి గిరాకీ ఉన్నది..

ఎకరం పొలంలో ప్రతి ఏటా చామంతి పూలను సాగు చేస్తూ అధిక లాభాలను పొందుతున్నా. పెండ్లిండ్లు, పూజల సమయంలో మంచి గిరాకీ ఉంటున్నది. చామంతి పూలను కులకచర్ల, మహబూబ్‌నగర్, హైదరాబాద్‌లోని మార్కెట్లకు తరలించి విక్రయిస్తున్నా. తక్కువ పెట్టుబడితో పూల సాగులో అధికంగా లాభాలను పొందొచ్చు.

**- వెంకటయ్యగౌడ్, ఇప్పాయిపల్లి గ్రామం,కులకచర్ల**



చామంతి పూలను సాగు చేసిన రైతు వెంకటయ్యగౌడ్

## తుంపర సేద్యం.. మెట్టకు లాభం..

- సూక్ష్మ, తుంపర సేద్యంతో సాగునీరు..శ్రమ ఆదా
- డ్రిప్, స్ప్రింక్లర్ల ద్వారా తక్కువ నీటి వినియోగం
- ఎక్కువ విస్తీర్ణంలోనూ పంటల సాగు



పంటకు తుంపర సేద్యం విధానంలో అందుతున్న నీరు

### సబ్సిడీపై డ్రిప్ పరికరాలు..

రాష్ట్రంలో పండ్లు, కూరగాయలు, పలు వాణిజ్య పంటల సాగు విస్తీర్ణాన్ని పెంచేందుకు ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణ రూపొందిస్తున్నది. జిల్లాను గతంలో క్రాప్‌కాలనీల కింద ఎంపిక చేసి పెద్ద ఎత్తున కూరగాయలు, తీగజాతి కూరగాయలు, ఆకుకూరల సాగుకు రైతులను ప్రోత్సహించింది. రైతులు నేటికి అదే రీతిలో పంటలు సాగుచేసుకుంటూ బిందు..తుంపర సేద్యం ద్వారా పంటలను సాగు చేసుకుంటున్నారు. ఐదెకరాల వరకు పండ్లు, కూరగాయలు సాగుచేసుకునే ఎస్సీ, ఎస్టీ రైతులకు 100శాతం సబ్సిడీ, బీసీ రైతులకు 90శాతం, ఇతర రైతులకు 80శాతం సబ్సిడీతో డ్రిప్ పరికరాలను ప్రభుత్వం అందిస్తున్నది. డ్రిప్ పరికరాలు అవసరం ఉన్న పండ్ల తోటలు, కూరగాయలు సాగు చేసుకునే రైతులు మీసేవ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. అనంతరం ఉద్యానవన అధికారులు ఫీల్డ్ వెరిఫికేషన్ చేసిన తర్వాతే రైతులకు బిందు సేద్యానికి సంబంధించిన పరికరాలను సబ్సిడీపై అందిస్తారు.

### దిగుబడిని సాధించొచ్చు..

తక్కువ శ్రమ, తక్కువ సాగునీటి వినియోగం వంటి సులభ పద్ధతులతో పంటలను సాగుచేసి దిగుబడులు పెంచుకోవాలి. డ్రిప్, స్ప్రింక్లర్ల ద్వారా పంటలకు సరిపడా నీటిని అందించటంతోపాటు శ్రమ, సమయం కలిసి వస్తుంది. పంటకు స్ప్రింక్లర్లను అమర్చి కొంత సమయాన్ని ఇతర పనులకు కేటాయించుకునే అవకాశం ఉంటుంది. డ్రిప్, స్ప్రింక్లర్ల ఏర్పాటుకు ఖర్చు తక్కువే. ఆరుతడి పంటల సాగుకు ఇవి ఎంతో ఉపయోగంగా ఉంటాయి. ప్రతి ఒక్కరూ ఈ విధానంపై దృష్టి సారిస్తే మంచి దిగుబడులను సాధించొచ్చు.

**-మొద్దు అంజిరెడ్డి, ఉత్తమరైతు, ఇబ్రహీంపట్నం**



ఇబ్రహీంపట్నం రూరల్, డిసెంబర్ 10: వ్యవసాయరంగంలో వస్తున్న ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని రైతులు అంది పుచ్చుకుంటున్నారు. సులభ విధానంలో వ్యవసాయం చేయడం.. తక్కువ ఖర్చు, తక్కువ శ్రమతో ఎక్కువ దిగుబడులు సాధించేందుకు మొగ్గు చూపుతున్నారు. తక్కువ నీటితో ఎక్కువ విస్తీర్ణంలో పంటలను సాగు చేసేందుకు సూక్ష్మ, తుంపర సేద్యం విధానం ఎంతో దోహదపడుతుంది. సాగునీటి ఎద్దడి ఉండే మెట్ట ప్రాంతాల్లో తుంపర సేద్యం రైతులకు ఎంతో ఉపయుక్తంగా ఉంటుంది. ఈ విధానం ద్వారా మంచి లాభాలను ఆర్జించొచ్చు. ఆరుతడి పంటలైన వేరుశనగ, శనగ, మొక్కజొన్న, బొబ్బెర్లు, కందులు, పెసర్లు, పత్తితోపాటు పలు రకాల ఆకుకూరలు, కూరగాయల పంటలను తుంపర సేద్యం ద్వారా విరివిగా పండించొచ్చని వ్యవసాయాధికారులు చెబుతున్నారు. తుంపర సేద్యంలో డ్రిప్, స్ప్రింక్లర్ల వాడకం ముఖ్యమైనవిగా చెప్పొచ్చు. డ్రిప్ విధానంలో పంటల్లోని ప్రతి సాలుకు సన్నని పైపు అమర్చి ఒక్కో చుక్క మొక్క మొదలులో పడేలా చేయడం, స్ప్రింక్లర్ల విధానంలో పంటలో పెద్ద పైపులు వేసి స్ప్రింకర్ల్ హెడ్ ద్వారా నీటిని విరజిమ్మి పంటకు నీరందించడం జరుగుతుంది.



### తక్కువ ఖర్చుతోనే స్ప్రింక్లర్ల ఏర్పాటు..

తుంపర సేద్యంలో భాగంగా స్ప్రింక్లర్లను ఏర్పాటు చేసుకునేందుకు రైతులకు ఖర్చు కూడా తక్కువే అని చెప్పొచ్చు. ఎకరం భూమిలో పంట సాగు కోసం స్ప్రింక్లర్ల పైపుల కోసం రూ.5వేల నుంచి రూ.6వేల వరకు ఖర్చువుతుంది. రెండు ఎకరాలకు రూ.7వేల వరకు, మూడు నుంచి నాలుగు ఎకరాలకు రూ.9వేల నుంచి రూ.12వేల వరకు ఖర్చుఅవుతుంది. పైపుల సైజులను బట్టి ఖర్చులోనూ తేడాలుంటాయి. అయితే, రైతులు కొనుగోలు చేసిన స్ప్రింక్లర్ పైపులు, హెడ్ వాల్వ్‌లను ఎప్పటికప్పుడు శుభ్రం చేసుకుంటే ఎక్కువ రోజులు ఎలాంటి అవాంతరాలు లేకుండా పంటలకు నీటిని అందిస్తాయి.

### స్ప్రింక్లర్లు అమర్చే విధానం..

స్ప్రింక్లర్లను మూడు విధాలుగా పంట పొలాల్లో అమర్చుకోవచ్చు. శాశ్వతంగా పైపులను భూమిలో పాతిపెట్టి స్ప్రింక్లర్ హెడ్‌లను అమర్చి నీటిని విరజిమ్మడం మొదటి విధానం.. కొన్ని పైపులు భూమిలోపల ఉంచి మిగతా పరికరాలను బయట ఉంచి మొక్కలన్నింటికీ తుంపర్లు పడేలా అమర్చుకోవడం రెండో పద్ధతి.. ఇక స్ప్రింక్లర్ పైపులన్నీ భూమిపైనే ఉంచి పంటకు నీరందించడం మూడో విధానంగా చెప్పొచ్చు. ఇందులో పైపులను ఒక్కచోట నుంచి మరో చోటుకు తరలించి అన్ని పంటలకు తుంపర సేద్యం ద్వారా నీటిని అందించేందుకు వీలవుతుంది. స్ప్రింక్లర్‌లో ముఖ్యమైనది స్ప్రింక్లర్‌హెడ్, ఇందులో రెండు రంధ్రాలుంటాయి. ఒకటి 4 నుంచి 5.6మి.మీల సైజు ఉండగా, ఇంకోటి 3.13 మి.మీల సైజు ఉంటుంది. ఎక్కువ పీడనం గల స్ప్రింక్లర్ సుమారు 35 మీటర్ల వ్యాసం కలిగిన భూమిని తడుపుతుంది. తక్కువ పీడనం గల స్ప్రింక్లర్ 30మీటర్ల వ్యాసంగల భూమిని మాత్రమే తడుపుతుంది.



డ్రిప్ విధానంలో మొక్క కాండం భాగంలో చుక్క చుక్కగా అందుతున్న నీరు

### పంటకు సరిపడా నీరు అందుతుంది..

బిందు, తుంపర సాగు విధానంలో పంటకు సమయానికి సరిపడా నీరు అంది పంట ఏపుగా పెరుగుతుంది. దీంతో మంచి దిగుబడులు వస్తాయి. పాత పద్ధతిలో పంటకు నీరందించాలంటే ఎక్కువనీరు వృథా అయ్యేది. తక్కువ నీటి వనరులు ఉన్న మెట్ట ప్రాంతాల్లో డ్రిప్, తుంపర విధానంలో పంటలను సాగు చేసేందుకు రైతులు ఆసక్తి చూపుతున్నారు. ఆరుతడి పంటలు వేసి రైతులు ఈ మార్గాన్ని ఎంచుకోవడం ఎంతో మంచిది.



**–శ్రవణ్‌కుమార్, ఏఈవో వ్యవసాయశాఖ, ఇబ్రహీంపట్నం**

### తుంపర సేద్యంతో లాభాలు..

- తుంపర సేద్యంలో పొలంగట్లు, కాలువలు, మడులు చేయాల్సిన అవసరం లేదు. దీంతో రైతుకు ఉన్న భూమిలో పంటను సాగు చేసుకోవచ్చు.
- సంప్రదాయ నీటి పారే విధానంతో పొలంగట్లు, కాలువగట్లకు 35 శాతం వరకు నీరు వృథాగా పోతుంది. కానీ స్ప్రింక్లర్లతో ఈ నష్టం ఉండదు.
- సాగు చేసిన పంటకు నీటిని తరచూ అవసరమైన పరిమాణంలో ఇవ్వడం ద్వారా పంట ఏపుగా పెరిగి దిగుబడులు కూడా సాధారణం కంటే 5నుంచి 20శాతం వరకు అదనంగా వస్తాయి.
- స్ప్రింక్లర్ల విధానంలో భూమి లోని పొరల్లోకి నీరు వెళ్లకుండా మొక్కల వేళ్ల వరకే వెళ్లి మొక్కకు కావాల్సిన నీరు అందుతుంది.
- స్ప్రింక్లర్ల నుంచి వెలువడే నీటి తుంపర్ల వల్ల భూమిపై నీరునిల్వ ఉండదు. మట్టి గడ్డ కట్టదు. అవసరమైన నిష్పత్తిలో నీరు, గాలి భూమిలో ఉంటూ విత్తనాలు ఆరోగ్యంగా మొలకెత్తి పంట దిగుబడి కూడా పెరుగుతుంది.
- తుంపర సేద్యంతో ఎగుడు, దిగుడుగా ఉన్న భూముల్లోనూ పంటలు పండుతాయి
- డ్రిప్‌సిస్టంతో పలు రకాల పండ్లతోటలను విరివిగా పెంచుకోవచ్చు.
- బిందుసేద్యంతో 30నుంచి 40శాతం విద్యుత్తు, 30 నుంచి 50శాతం ఎరువులు ఆదా అవుతాయి.
- ఎత్తు, పల్లాలు ఉన్న భూముల్లోనూ అన్ని మొక్కలకు ఒకే మోతాదులో నీరు అందటం వల్ల పంట ఏపుగా పెరుగుతుంది.
- బిందుసేద్యంలో భూమి కోతకు గురికాకుండా..భూసారం కోల్పోకుండా, పంటకు చీడపీడలు రాకుండా ఎంతో మేలు చేస్తుంది.

## కొండల్ని తొలచి.. కొత్త దారులు..



ల్యాంకోహిల్స్ నుంచి ఖాజాగూడ హిల్స్ మీదుగా ఔటర్ రింగు రోడ్డు వరకు కొత్తగా నిర్మించిన లింకు రోడ్డు

- అసాధ్యం అనుకున్న మార్గాన్ని సుసాధ్యం చేసిన బీఆర్ఎస్ ప్రభుత్వం
- ఐటీ కారిడార్‌లో కొత్త లింకు రోడ్లతో ట్రాఫిక్ చిక్కులకు ఇక చెల్లు

సిటీబ్యూరో, డిసెంబర్ 10 (నమస్తే తెలంగాణ): అభివృద్ధి చెందుతున్న హైదరాబాద్ మహానగరంలో ప్రధాన రహదారులకు ప్రత్యామ్నాయంగా లింకురోడ్లను నిర్మించేందుకు గత బీఆర్ఎస్ ప్రభుత్వం ముమ్మరంగా చర్యలు చేపట్టింది. నిర్ణయించిన గమ్యస్థానం చేరుకోవాలంటే ఎత్తైన కొండలు, బండరాళ్లు ఉన్నా వెనకడుగు వేయకుండా కొండల్ని తొలచి కొత్తదారులు వేసింది. ఆ కొత్తదారులు ఇప్పుడు ఐటీకారిడార్‌లో భారీ ట్రాఫిక్ సమస్య నుంచి వాహనదారులకు ఊరటనిస్తున్నాయి. గణనీయంగా పెరిగిన ట్రాఫిక్ రద్దీ సాఫీగా సాగేందుకు కొండల్ని తొలగించి కొత్తగా వేసిన దారులు నగరానికి కొత్త నడకలను నేర్పుతున్నాయి. అలా వేసినవే జూబ్లీహిల్స్ రోడ్ నంబర్-51 నుంచి పాత ముంబై హైవే మార్గం, రాయదుర్గం నాలెడ్జ్ సిటీ నుంచి పాత ముంబై హైవే మార్గం, బయోడైవర్సిటీ నుంచి ఇంజినీరింగ్ సాఫ్ట్ కాలేజీ మీదుగా ఖాజాగూడ రోడ్డు, మణికొండ చిత్రపురి కాలనీ నుంచి ల్యాంకోహిల్స్, తిరిగి అక్కడి నుంచి ఖాజాగూడహిల్స్ మీదుగా ఔటర్ రింగు రోడ్డు వరకు.. పలు లింకు రోడ్లన్నీ కొండలు, గుట్టలతో కూడిన ప్రాంతాల మీదుగా నిర్మించారు. విశాలమైన వెడల్పుతో లింకురోడ్లను అందుబాటులోకి తీసుకొచ్చి బీఆర్ఎస్ ప్రభుత్వం అసాధ్యాన్ని సుసాధ్యం చేసింది.



విశాలంగా నాలుగు వరుసలతో మధ్యలో డివైడర్‌ను ఏర్పాటు చేస్తూ నిర్మించిన లింకురోడ్డు

### మూడు లింకురోడ్లతో నేరుగా ఓఆర్ఆర్‌కు ..

కోర్‌సిటీలో అత్యంత కీలకమైన జూబ్లీహిల్స్, బంజారాహిల్స్ ప్రాంతాల నుంచి ఔటర్‌రింగు రోడ్డు వరకు ట్రాఫిక్ చిక్కులు లేకుండా సాఫీగా చేరుకోవడమే లక్ష్యంగా గత ప్రభుత్వం ఒక లింకురోడ్డును ప్రతిపాదించింది. కేబీఆర్‌పార్కును అనుకొని ఉన్న రోడ్డు నంబర్-45 నుంచి నేరు గా ఓఆర్ఆర్ దాకా వెళ్లేందుకు మూడు దశల్లో లింకురోడ్లను నిర్మించేలా ప్రతిపాదనలు రూపొందించారు. మాదాపూర్ కేబుల్ బ్రిడ్జి, మాదాపూర్ హైటెక్‌సిటీ రోడ్లకు ప్రత్యామ్నాయంగా రాయదుర్గం, మణికొండ, ల్యాం కోహిల్స్, పుప్పాల్‌గూడ, ఖాజాగూడహిల్స్ మీదుగా ఓఆర్ఆర్ వరకు మొత్తం మూడు లింకురోడ్లను చేపట్టారు. ఈ మార్గంలో అన్ని గుట్టలతో కూడిన ప్రాంతాలే ఉన్నాయి. బీఆర్ఎస్ ప్రభుత్వం వెనకడుగు వేయకుండా దశలవారీగా ఒక్కో లింకు రోడ్డు నిర్మాణ పనులను హైదరాబాద్ రోడ్ డెవలప్‌మెంట్ అభివృద్ధి కార్పొరేషన్ లిమిటెడ్ (హెచ్ఆర్‌డీసీఎల్) ఇంజినీర్లతో సమర్థవంతంగా పూర్తి చేయించి అందుబాటులోకి తీసు కొచ్చింది. ఈ మార్గంలో ఇప్పటికే 2 లింకురోడ్లు అందుబాటులోకి రాకా, చివరిదైన లింకురోడ్డు ల్యాంకోహిల్స్ నుంచి ఖాజాగూడహిల్స్, పుప్పాల్‌గూడ మీదుగా ఓఆర్ఆర్ వరకు నిర్మాణ పనులు పూర్తై ప్రారంభానికి సిద్ధంగా ఉన్నది. 3వ దశ లింకురోడ్డు ప్రారంభమైతే జూబ్లీహిల్స్ రోడ్ నంబర్-45 నుంచి నేరుగా ఓఆర్ఆర్ వరకు ఎలాంటి ట్రాఫిక్ రద్దీ, సిగ్నల్స్ లేకుండా రాకపోకలు సాగించొచ్చు. దీంతో ఇప్పటివరకు ప్రధాన రహదారులపై ఉన్న రద్దీ సైతం గణనీయంగా తగ్గనున్నదని ఇంజినీర్లు పేర్కొంటున్నారు.

